క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పీలేరు రూరల్ : మండలంలోని వివిధ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం 7 గంటలకు ఎర్రగుంట్లపల్లె, 9.30 గంటలకు రేగళ్లు, 10.30 గంటలకు దొడ్డిపల్లె, 11.30 గంటలకు బాలంవారిపల్లె, 12 గంటలకు అగ్రహారం, 1.00 గంటకు కాకులారంపల్లెలో గ్రామ స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం ఉంటుందని చెప్పారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

పీలేరు : మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లె వద్ద నూతనంగా నిర్మించి అంకాలమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం విగ్రహ ప్రతిష్ట చేయనున్న నేపథ్యంలో ఆదివారం ఆలయంలో గణపతిపూజ, కలిశస్థాపన, నవగ్రహ ఆరాధన, హోమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భవనం వెంకటరమణారెడ్డి, గాయం నాగభూషణం రెడ్డి, గాయం మధుసూదన్‌రెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజాపోరు యాత్ర

రామసముద్రం: మండలంలోని బరిడేపల్లెలో ఆదివారం జాతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ప్రజాపోరుయాత్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ కన్వీనర్ నానబాలకుమార్ హాజరయ్యారు. రామసముద్రం, కురిజల, ఊలపాడు పంచాయతీలలో యాత్ర సాగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇంజం ఆనంద్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, మదనపల్లె అసెంబ్లీ ప్రజాపోరుయాత్ర కన్వీనర్ వేణు, కో కన్వీనర్ శబరి, అన్నమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు వినియోగించుకోవాలి

మదనపల్లె సిటీ: మానవత సంస్థ చేస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఆ సంస్థ డివిజన్ చైర్మన్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. ఆదివారం మదనపల్లెలో మానవత సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉచితంగా వైకుంఠ రథం, ఫ్రీజర్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.దీంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9441277306, 9492672906, 9441656535 ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి, సభ్యులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ అవతారంలో లక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీజనార్దనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు శ్రీమహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారధిబట్టర్, కులశేఖర్‌బట్టర్‌లు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవతో పాటు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రెడ్డెమ్మతల్లీ..కరుణించమ్మా..

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మదనపల్లె : పాతికేళ్ల తర్వాత పాత స్నేహితులంతా చదువులమ్మ చెట్టునీడకు చేరారు. పదోతరగతిలో తాము చదువుకున్న పాఠశాలను తమ కలయికకు వేదికగా మార్చుకున్నారు. మండలంలోని సీటీఎం జెడ్పీహైస్కూల్‌లో ఆదివారం 1998–99 పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. అప్పటి విద్యార్థులు బి.రవికుమార్, వై.బయ్యారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులందరూ హాజరయ్యారు. తరగతి గదిలో తాము చేసిన అల్లర్లు, నాటి జ్ఞాపకాలను, గురువులు చెప్పిన మాటలను గుర్తుచేసుకుని మురిసిపోయారు.

మైనార్టీల సత్తా చూపిస్తాం

వాల్మీకిపురం: బీజేపీతో పొత్తు కోసం తహతహలాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల నాయకత్వాన్ని అణగదొక్కడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు మైనార్టీల సత్తా ఏంటో చూపిస్తామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ 94 మందితో ప్రకటించిన తొలి జాబితాలో మైనార్టీలకు కేవలం ఒక టికెట్ మాత్రమే కేటాయించడం టీడీపీకి మైనార్టీలపై ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోందన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- కార్పొరేటుకు ధీటుగా ప్రభుత్వాసుపత్రి
- పీలేరు నియోజకవర్గంలో కొత్తగా ప్రాంతీయ వైద్యశాలలు
- రూ.37.48కోట్ల వ్యయంతో అత్యాధునిక సేవలకు భవనాలు సిద్ధం
- త్వరలో నూతన ఆసుపత్రి భవనం ప్రారంభం


వాల్మీకిపురంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వాసుపత్రి

వాల్మీకిపురం: పీలేరు నియోజకవర్గంలో సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజారోగ్యానికి పెద్దపీట వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో నియోజకవర్గంలోని ఉన్న పెద్దాసుపత్రులు కొత్తగా అవతరిస్తున్నాయి. అత్యాధునిక సేవలందించేందుకు భవనాలను సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు రూ.37.48 కోట్ల వ్యయంతో పీలేరులో 100 పడకలు, వాల్మీకిపురంలో 50 పడకలు, కలికిరిలో 30 పడకల ఆసుపత్రుల భవనాల నిర్మాణాలు శరవేగంతో పూర్తయ్యాయి. పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, వాల్మీకిపురం, కలికిరిలో ఉన్న ప్రాంతీయ వైద్యశాలలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ కేంద్రాల్లో ఉన్న పెద్దాసుపత్రులకు వాటి స్థాయిని బట్టి పునర్నిర్మాణాలు పూర్తయ్యాయి. ఫలితంగా అన్ని ఆసుపత్రులు నూతన హంగులను సంతరించుకుంటున్నాయి. ఈ భవనాలు త్వరలో ప్రారంభం కానున్నాయి.

నిధులు కేటాయింపులు ఇలా..

పీలేరు నియోజకవర్గంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాల నిర్మాణాలకు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. పీలేరుకు రూ.24 కోట్లు, వాల్మీకిపురంకు రూ.7 కోట్లు, కలికిరికి రూ.6.48 కోట్లుతో నిర్మాణ పనులు పూర్తయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి.

కార్పొరేట్ తరహాలో ప్రాంతీయ వైద్యశాలలు



నియోజకవర్గంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాలు కార్పొరేటు ఆసుపత్రుల తరహాలో రూపుదిద్దుకుంటున్నాయి. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైద్యానికి పెద్దపీట వేస్తున్నారు. గత ప్రభుత్వాలు అదిగో ఇదిగో ఆసుపత్రుల స్థాయి పెంపు అంటూ కాలయాపన చేశాయి. మేము ఇచ్చిన హామీ మేరకు అమలు చేసి చూపించాం. - పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎంపీ

పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం



గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేటు స్థాయి వైద్యం అందించడమే లక్ష్యం. పీలేరు ప్రభుత్వాసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా, వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రిని 30 పడకల నుంచి 50 పడకలుగా, కలికిరి ప్రభుత్వాసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా హోదా కల్పించాం.

- చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే, పీలేరు

ఈశ్వరమ్మకాలనీ రూపురేఖలు మారుస్తాం

నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్


కాలువల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : మున్సిపాలిటీకి దగ్గరగా ఉండి, అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురైన ఈశ్వరమ్మకాలనీని దత్తత తీసుకుని రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తానని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. మండలంలోని ఈశ్వరమ్మకాలనీ పంచాయతీ సర్పంచ్ రెడ్డెమ్మ ఆధ్వర్యంలో రూ.10లక్షల నిధులతో నిర్మిస్తున్న మురుగుకాలువల నిర్మాణానికి నిసార్‌అహ్మద్ పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశ్వరమ్మ కాలనీ పట్టణానికి అనుకుని ఉన్నప్పటికీ, రోడ్లు, మురుగుకాలువలు ఆశించిన స్థాయిలో నిర్మాణాలు జరగలేదన్నారు. ప్రజల వినతి మేరకు సీసీ రోడ్లు వేసేందుకు మొదట మురుగుకాలువల నిర్మాణం చేయాల్సి ఉన్నందున సర్పంచ్ రెడ్డెమ్మతో మాట్లాడి పంచాయతీ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలు వెచ్చించి డ్రైయిన్ల నిర్మాణానికి పనులు ప్రారంభించామన్నారు. ఈ పనులు జరిగిన వెంటనే సీసీ రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈశ్వరమ్మ కాలనీ వైఎస్సార్ సీపీకి కంచుకోటగా ఉంటోందని, ప్రజలందరి ఆశీర్వాదంతో ఎమ్మెల్యే అయ్యాక, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థినైన తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బస్రి, మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, శ్రీకాంత్‌రెడ్డి, ఇస్మాయిల్, నారాయణస్వామి, ఇర్ఫాన్, రహంతుల్లా, జగ్గ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీక, మానసికోల్లాసం



మాట్లాడుతున్న సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు : క్రీడలతో శారీక, మానసికోల్లాసం కల్గుతుందని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక నాగిరెడ్డి కాలనీలోని ఇండోర్ స్టేడియంలో బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 40 టీములు పోటీపడుతున్నట్లు తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకుని క్రీడాస్ఫూర్తి కల్గి ఉండాలని చెప్పారు. మొదటి బహుమతి రూ. 10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 7 వేలు, తృతీయ బహుమతి రూ. 5వేలు, నాల్గవ బహుమతి రూ. 3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, వీఎస్ఎన్ పాఠశాల కరస్పాండెంట్ మాధవి, వార్డు మెంబరు మల్లికార్జునరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సమక్షంలో చేరారు. తంబళ్లపల్లె, బోయపల్లె, శ్రీనివాసకాలనీ గ్రామాలకు చెందిన పలువురు శంకర, శ్రీనివాసులు,వెంకటరమణ, దుర్గా ,మహేష్, సాయి,రాజన్న, చెన్నకేశవ,రవి, శ్రీనాథ్, రమేష్, ప్రవీణ్, గణేష్ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారిని సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ఇంతకాలం టీడీపీలో చంద్రబాబు ఎన్ని మోసాలు చేసినా భరించాం..ఇప్పుడు ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి ,పార్టీలకు, రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రతి కుటుంబం గడప తొక్కి సంక్షేమ పథకాలు అందిస్తూ అహర్నిశలు పేద వర్గాల అభ్యున్నతికి ఆయన చూపుతున్న కృషి మరువరాదన్నారు. టీడీపీలో ప్రస్తుతం జరుగుతున్న తీరు నచ్చక వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. ద్వారకనాథరెడ్డిని అత్యధిక మెజార్టీలో గెలిపించడానికి కృషి చేస్తామన్నారు.

29న నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట

మదనపల్లె సిటీ: కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 29న నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు అర్చకులు కుమారస్వామి తెలిపారు.

బ్రిటీష్ జనరల్ డయ్యర్ కంటే మోదీనే ప్రమాదం

మదనపల్లె : జలియన్ వాలాబాగ్ ఊచకోత ఉదంతంలో నిరసనకారులపై కాల్పులు జరిపించిన బ్రిటీష్ జనరల్ డయ్యర్ కంటే...బీజేపీ ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశానికి ప్రమాదమని సీపీఐ నాయకులు అన్నారు. ఢిల్లీ రైతాంగ పోరాటంపై మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై, సీపీఐ మదనపల్లె నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీయా కార్యాలయం నుంచి బెంగళూరు బస్టాండ్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ట్రాక్టర్లతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్. నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు క్రిష్టప్ప,మనోహర్ రెడ్డి,సాంబ, సుధీర్,సుమిత్రమ్మ,విశ్వనాథ్ నాయక్, కోటేశ్వర రావు,సూరి,మాధవ్,నవీన్,శీను, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు పలవలి రామకృష్ణారెడ్డి

మదనపల్లె : రైతులు, కార్మికులు కోసం వెన్నుదన్నుగా నిల్చుని ప్రజా ఉద్యమాలకు ఒరవడి దిద్దిన పలవలి రామకృష్ణారెడ్డి ఆదర్శ కమ్యూనిస్టు అని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. పలవలి రామకృష్ణారెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా సీపీఎం మదనపల్లె ఆధ్వర్యంలో వర్ధంతిసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన శ్రీనివాసులు మాట్లాడుతూ ఇండియా, చైనా యుద్ధంలో అరెస్టై జైలుకు వెళ్లడమే కాకుండా న్యాయవాద వృత్తి ద్వారా పేదలకు సేవలందించిన ఆదర్శ కమ్యూనిస్టు అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూ ఆశయ సాధనకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు


ఎమ్మెల్యే చింతలను సన్మానిస్తున్న మైనార్టీలు

వాల్మీకిపురం: వాల్మీకిపురంలోని హజరత్ ఖాజా పీర్ మస్తాన్‌వలి దర్గా ఉరుసు ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. శుక్రవారం నుండి మూడు రోజుల పాటు జరిగిన ఉరుసు ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని జ్ఞాపిక, శాలువతో సత్కరించారు. నెల నెల దర్గాలో నిర్వహించే ఫాతెహా కార్యక్రమంలో భాగంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే చింతల అన్నారు. అలాగే ఉరుసు ఉత్సవానికి హాజరైన కడప పెద్ద దర్గా పీఠాధిపతి సయ్యద్ ఆరిపుల్లా బాష సాహెబ్, వక్ఫ్ బోర్డ్ చైర్మెన్ కరీముల్లాలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వీరిని స్థానిక దర్గా కమిటీ సభ్యులు సన్మానించి, మెమెంటోలు అందించారు. ఈ ఉత్సవాల్లో హిందూ, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో మతసామరస్యం వెలివేరిసింది. తహలీల్ ఫాతెహాతో ఉరుసు ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో బిడ్డల కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, నీళ్లభాస్కర్, ఆఫూ మొహియుద్దిన్, అబ్దుల్ అజీమ్, మహబూబ్ బాషా, సందాని బాషా, షాహెద్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్: రానున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్ పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మేళ్లచెరువు, తలపల ,జాండ్ల, గూడరేవుపల్లె,బోడుమల్లువారిపల్లె, ముదుపులవేముల, కావలిపల్లె, వేపులబైలు పంచాయతీల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు కలసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. పార్టీలో చిన్న చిన్న సమస్యలను, విభేదాలను పక్కనబెట్టి సమష్టి కృషితో గెలుపు కోసం పనిచేయాలన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిను గెలిపించి రాష్ట్రానికి రెండవ సారి జగనన్న ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సతీష్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, మండల సచివాలయల కన్వీనర్ ఆనంద్, మండల ఆర్బీకే చైర్మెన్ మల్లికార్జున, సర్పంచ్‌లు చిన్నకొండయ్య, సందీప్‌రెడ్డి, నీలిమా,జగన్మోహన్‌రెడ్డి, జయలక్ష్మీదేవి, రాజేష్, లోకనాథరెడ్డి, చెంగల్రాయుడు, ఎంపీటీసీ కిరణ్‌కుమార్‌నాయుడు, వెంకట్రమణనాయుడు, చెంగల్రాయుడు, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు


అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ఏపీపీఎస్సీ గ్రూప్–2 స్క్రీనింగ్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. శ్రీకృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కాలేజ్, శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కాలేజ్, శ్రీ సిద్ధార్థ జూనియర్ కాలేజ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, బీటీ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విశ్వం డిగ్రీ కళాశాల, అంగళ్లు మిట్స్‌కాలేజీలో గ్రూప్–2 పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండటంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచే పరీక్షా కేంద్రాలకు అభ్యర్థుల రాక మొదలైంది. ప్రతి కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేసి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులను అందుబాటులో ఉంచడంతో కేంద్రంలోని రూములకు సంబంధించిన సమాచారం తెలిపారు. అభ్యర్థుల సెల్‌ఫోన్స్, బ్యాగులను ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఉదయం 10.30కు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1 గంటవరకు జరిగింది. పరీక్షల నిర్వహణను ఏపీపీఎస్సీ మెంబర్ జీ.వి.సుధాకరరెడ్డి, ఆర్డీఓ హరిప్రసాద్ విశ్వం, మిట్స్, బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహణను పరిశీలించి, సిబ్బందికి పలుసూచనలు చేశారు.

ప్రారంభమైన నలవీరగంగమ్మ జాతర


విద్యుత్ వెలుగుల్లో అమ్మవారి ఆలయం

మదనపల్లె సిటీ: కోరిన కోర్కెలు తీర్చే నలవీర గంగాభవానీ జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొట్టమొదట జరిగే జాతర ఇది. వేలాదిమంది భక్తుల గ్రామదేవతగా పేరుపొందిన అమ్మవారి జాతర గురువారం వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పౌర్ణమి మరుసటి రోజు నుంచి జాతర నిర్వహిస్తారు. సీటీఎం, సీటీఎం క్రాస్, కొత్తవారిపల్లె, దబ్బిగానిపల్లె పంచాయతీ పరిధిలోని 120 గ్రామాల్లో జాతరను నిర్వహిస్తారు. సోమవారం సిద్దుల భక్తి, 26న సోమవారం రాత్రి తిరుణాల, మంగళవారం పగలు తిరుణాల, అమ్మవారి ఊరేగింపు, బుధ, గురువారంతో దోపు తిరుణాలతో జాతర ముగుస్తుంది.